క్లుప్తంగా

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనారిటీ బాలికల గురుకులం హనుమకొండ (జీ1)లో 5, 6వ తరగతుల్లో నాన్ మైనారిటీ కోటా కింద ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముత్తిరెడ్డి నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ (1), బీసీ (1), ఓసీ (1), ఆరో తరగతిలో బీసీ (1) ఖాళీ సీట్లు ఉన్నాయని, సెప్టెంబర్ 1లోపు గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కేఎంసీ కార్మికుల సమ్మె విరమణ

ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరునెలల పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు అంగీకరించినందున సమ్మెను విరమిస్తున్నట్లు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.యాదానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. 18 రోజులుగా జరుగుతున్న సమ్మెకు స్పందించిన ప్రభుత్వం.. ఆరు నెలల వేతనాలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించిందని, మిగిలిన రెండు నెలల వేతనాలు పది రోజుల్లో విడుదల చేయనున్నట్లు తెలిపిందని పేర్కొన్నారు. ఈ మేరకు కార్మికులు సమ్మె విరమించి శనివారం నుంచి విధుల్లో హాజరుకానున్నట్లు వారు వివరించారు.

డయల్ 100ను దుర్వినియోగం చేస్తే చర్యలు



న్యూశాయంపేట: డయల్ 100ను అత్యవసరం నిమిత్తం వినియోగించుకోవాలని, దుర్వినియోగం చేస్తూ, పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేస్తే సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన కొండపల్లి రాజ్‌కుమార్.. రాత్రి వేళల్లో 100కు డయల్ చేసి బూతులు తిట్టడం, కాలనీలోని వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు అతడి తండ్రిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి రాజ్‌కుమార్‌ను వరంగల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

టీచింగ్ లెర్నింగ్ మేళా ప్రారంభం

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళాను జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్ శుక్రవారం ప్రారంభించారు. కడిపికొండ పాఠశాల నుంచి ఉపాధ్యాయులు బోనాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. మండల విద్యాశాఖ అధికారి బండారు మనోజ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి లర్నింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



రామన్నపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైన సంఘటన నగరంలోని రఘునాథ్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని 29వ డివిజన్ రఘునాథ్ కాలనీలో నివాసముంటున్న తెలకలపల్లి సూరి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారి మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న సామాన్లు కాలిపోయాయి. ఈ క్రమంలో రవి భార్య, ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం మేరకు పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు రవి తెలిపారు.

డీజే ఆపరేటర్ల బైండోవర్



న్యూశాయంపేట: గణపతి ఉత్సవాల సందర్భంగా నిషేధించిన డీజేలను వినియోగిస్తున్న నిర్వాహకులను వరంగల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. నిబంధనలు పాటించాలని ఆయన హెచ్చరించారు.

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి దేవి



హన్మకొండ అర్బన్: భాద్రపద మాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో పద్మాక్షి దేవిని చామంతులు, మల్లెలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలకరించినట్లు దేవాలయ పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, తీర్థప్రసాదాలు అందజేసినట్లు వివరించారు.

చెత్త వేయకుండా చెక్

- విసూత్న ఆలోచన చేసిన కేఎల్ఎన్ రెడ్డి కాలనీ వాసులు



మొక్కలు నాటుతున్న ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్



కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని లక్ష్మీసాయి రెసిడెన్సీ ఎదురుగా ఏర్పాటు చేసిన కంచె

హన్మకొండ: వరంగల్ మహానగరంలో వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. ఇంటింటికి చెత్త సేకరణ వాహనాలు తిరుగుతూ చెత్త సేకరిస్తున్నా.. సోమరితనాన్ని వీడని కొందరు ప్రబుద్ధులు.. వారికి తీరిక వేళల్లో తీసుకెళ్లి వీధుల్లో పడేస్తున్నారు. నివాస గృహాల మధ్య వ్యర్థాలు పడేయడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ క్రమంలో కొంత మంది నగరవాసులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. చెత్తాచెదారం వేయకుండా రోడ్డుకు ఇరువైపులా కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలు నాటుతున్నారు. మరికొందరు చెప్పుల దండలు కుడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గులు పోస్తున్నారు. అయినా, చెత్త బుద్ధి పోని వారిలో మార్పు రావడం లేదు. ఈ క్రమంలో హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని లక్ష్మీసాయి రెసిడెన్సీ ఎదురుగా వ్యర్థాలు పడేయడంతో అపార్ట్‌మెంట్ నివాసితులు దుర్వాసన భరించలేక దాని నివారణకు కంచె ఏర్పాటు చేశారు. పలు మొక్కలు నాటారు. ఇటీవల కంచె ఏర్పాటు చేసి సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్‌తో కాలనీవాసులు పలు మొక్కలు నాటారు.

వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు రామమూర్తి



కేయూ తెలుగు విభాగంలో రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



హసన్‌పర్తి: పలకలపై వర్ణమాలను ప్రదర్శిస్తున్న సుజాత పాఠశాల విద్యార్థులు

కేయూ క్యాంపస్: వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి సాహిత్యసేవను గుర్తుంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మామిడి లింగయ్య కోరారు. కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగంలో గిడుగు రామమూర్తి జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రరాజు, అధ్యాపకులు డాక్టర్ సదాశివ్ పాల్గొన్నారు.

కేడీసీ, పింగిళి కళాశాలల్లో..

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పింగిళి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కేడీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, పింగిళి డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, తెలుగు శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతృభాషను ఆదరించాలి

హసన్‌పర్తి: మాతృభాషను ప్రతిఒక్కరూ ఆదరించాలని ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు సూచించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రాంబాబు మాట్లాడుతూ తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యకరమైన జీవన శైలి



కేయూ క్యాంపస్: ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, తదితరులు



ధ్యాన్‌చంద్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సుబేదారి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: క్రీడలతో ఆరోగ్యకరమైన జీవన శైలి అలవడుతుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని కేయూలోని స్పోర్ట్స్ బోర్డు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వెంకయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శశికాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని హనుమకొండ ప్రభుత్వ పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

హన్మకొండ అర్బన్: సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం గుగులోతు నెహ్రూ మాట్లాడుతూ జీవితంలో క్రీడలు ముఖ్యపాత్ర వహిస్తాయని అన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ కర్ణాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

న్యూశాయంపేట: హనుమకొండ ములుగురోడ్డు పెద్దగడ్డ మైనార్టీ బాలుర గురుకులంలో ధ్యాన్‌చంద్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. వరంగల్ ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.షుకుర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, డిప్యూటీ వార్డెన్ సయ్యద్ ఉస్మాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: రెండో డివిజన్ రెడ్డిపురంలోని విజయలక్ష్మి కాలనీలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. రానున్న మూడేళ్లలో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలో సన్నరకం బియ్యాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. కార్పొరేటర్ రవినాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మార్త రవి, దోమ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'ఉనికి కోసమే బీజేపీ ఆరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న బంక సరళ

హన్మకొండ: ప్రజాబలం లేని బీజేపీ.. ఉనికి కోసం ఆరాటపడుతోందని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్ విమర్శించారు. హనుమకొండ కృష్ణాకాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ పాలనలో 18 నెలల్లో జరిగిందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, గంట రవికుమార్, నాయకుడు రావుల కిషన్ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సమావేశంలో తేళ్ల సుగుణ, దువ్వ రేవతి, కొండె సుకన్య, తాళ్లపల్లి మేరీ, బాంత సుజాత, అల్లం సుగుణ, మున్ని, కేసరి ఇందిర, ఎస్.కవిత, సునీత, రమ్య, అను, రజిత పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పసలేని మాటలు

కాజీపేట: అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిపోయిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని సంస్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై బీజేపీ నాయకులు పసలేని మాటలు మాట్లాడడం మానుకోవాలని కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ హితవు పలికారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, భద్రకాళి ఆలయ పాలక మండలి సభ్యుడు పి.ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్ పాల్గొన్నారు.

ఉద్యోగులు ఉద్యమంలో పాల్గొనాలి



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో జిల్లాలోని ఉద్యోగులంతా భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ చైర్మన్ ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో పెన్షన్ విద్రోహదినం వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలవుతున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. అలాగే, రహదారులు, భవనాల శాఖ, మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖ, పాలిటెక్నిక్ కళాశాల, కాకతీయ వైద్య కళాశాలలో పెన్షన్ విద్రోహ దినం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, జేఏసీ నాయకులు కిరణ్ గౌడ్, వెంకటేశ్వర్లు, రవిప్రకాష్, పుల్లూరు వేణుగోపాల్, పనికిల రాజేష్, శ్యాంసుందర్, రాము నాయక్, కత్తి రమేష్, రాజమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నైపుణ్యాలు కలిగి ఉండాలి

కేయూ క్యాంపస్: వ్యాపార విశ్లేషకులు కీలక నైపుణ్యాలు కలిగి ఉండాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ రాహుల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ఆయన శుక్రవారం పాల్గొని మాట్లాడారు. వ్యాపార విశ్లేషణలో డేటా సేకరణతో పాటు దాని వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి, ప్రొఫెసర్ రాజేందర్, ప్రొఫెసర్ నర్సింహాచారి, ప్రొఫెసర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలి

కేయూ క్యాంపస్: విద్యార్థుల ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) డైరెక్టర్ డాక్టర్ మేఘనరావు సూచించారు. కేయూలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమం ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఇంజనీరింగ్ తర్వాత ప్రభుత్వ రంగం, ఇతర విభాగాల్లోని ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి టెలికాం అసిస్టెంట్ డైరెక్టర్ చింతల రమేష్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి యథావిధిగా తరగతులు జరుగుతాయని చెప్పారు. అధ్యాపకులు సుమలత, కల్పన, ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

కాజీపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. కాజీపేట మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, కుడిస్వామి, దీన, స్వరూప పాల్గొన్నారు.

డీఈఓ రంగయ్యనాయుడికి సన్మానం

ఖిలా వరంగల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన వరంగల్ డీఈఓ రంగయ్య నాయుడును వరంగల్ వడుప్సా (ట్రస్మా) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, బాధ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రతినిధులు కోడం శ్రీధర్, కూచన క్రాంతికుమార్, రవీందర్, వెంకటేశ్వర్లు, రాజు, వెంకట్రాజం, మోహన్, ప్రవీణ్, విశ్వనాథ్, శరత్‌బాబు, శ్రీనివాస్, చక్రపాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వరంగల్ చౌరస్తా: ఆటో కార్మికులకు కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. వరంగల్ నర్సంపేట రోడ్డులో డీమార్ట్ సెంటర్ వద్ద ఆటో అడ్డాను శుక్రవారం ఏర్పాటు చేశారు. సంఘం నాయకులు తాటికాయల రత్నం, ఎస్‌డీ.బాబా, ఎండీ.ఫర్విజ్, రహమతుల్లా, ముస్తఫా, హుస్సేన్ నాయక్, ఆఫిల్ చారి, బాజీర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

వరంగల్ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని తెలంగాణ జాగృతి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గలో శుక్రవారం నిరసన తెలిపారు. జాగృతి నాయకురాలు నూకల రాణి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి మారిపెల్లి మాధవి మాట్లాడారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను పోస్ట్ చేశారు. కార్యక్రమంలో చింత సునీత, కేతిరి సమ్మక్క, హేమావతి, విజయ, అరుణ, విజయ, భాగ్యలక్ష్మి, లావణ్య అనిత, వనిత, మీన పాల్గొన్నారు.

వాకర్స్‌కు వాకింగ్ పోటీలు

హసన్‌పర్తి: జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ వాకర్స్ 303 కేబినెట్ సెక్రటరీ రాంచందర్ మాట్లాడుతూ వ్యాయామం ఆరోగ్యానికి మంచి ఔషధంగా పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్ 303 పీఆర్వో ఉపేందర్, వాకర్స్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, ముఖ్య సలహాదారుడు యుగంధర్ పాల్గొన్నారు.

నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి

హన్మకొండ: గణపతి నవరాత్రి ఉత్సవ నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ సూచించారు. వరంగల్‌లోని ఉత్సవ మండపాలను శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డాక్టర్ గడ్డం కృష్ణయ్యను పరిశోధక విద్యార్థులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, స్కాలర్స్ కత్తెరపెల్లి దామోదర్, మాచర్ల శరత్‌చంద్ర, బైరపాక ప్రశాంత్, ఎం.కుమార్, కలకోట్ల సుమన్, డాక్టర్ పాలకుల కొమురయ్య, డాక్టర్ జెట్టి రాజేందర్, ప్రశాంత్, తిరుపతి పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు జీపు అడ్డా వద్ద ప్రధాన తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడగా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. పైపులైన్ లీకేజీతో వారం రోజులుగా తాగునీరు ఏరులై పారుతోంది. ప్రజల ఫిర్యాదుతో బల్దియా అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. మరమ్మతులను అధికారులు శుక్రవారం పర్యవేక్షించారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ అండర్ రైల్వేగేట్ శివనగర్ పల్లవి ఆస్పత్రి వద్ద జరుగుతున్న ప్రధాన పైపులైన్ మరమ్మతుల వల్ల పలు ప్రాంతాలకు శనివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ సంతోష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శివనగర్, చింతల్, ఖిలా వరంగల్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అసెస్‌మెంట్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఐసీటీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి కోసం ప్రీ అసెస్‌మెంట్ పరీక్షను శుక్రవారం నిర్వహించగా 74మంది అభ్యర్థులు హాజరయ్యారు.

హోటల్ నిర్వాహకులపై దాడి

కాజీపేట : కాజీపేట ప్రధాన రహదారిపై ఓ హోటల్ నిర్వాహకుడి కుమారుడిపై కొంత మంది యువకులు శుక్రవారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సోమిడి రోడ్డులో హోటల్ నిర్వహిస్తున్న రాము వద్దకు స్థానిక యువకులు వెళ్లి బజ్జీలు కావాలని అడిగారు. అలాగే, డబ్బులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో వారి మధ్య వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. ఈ క్రమంలో వారు దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో హోటల్ యజమాని కుమారుడితో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజహితం కోసం పనిచేయాలి



సమాచార కమిషనర్లను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులు

నయీంనగర్: జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్లు పివి.శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. అధికార పర్యటన నిమిత్తం వరంగల్‌కు వచ్చిన వారిని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టులు సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు, క్లబ్ సభ్యులతో సమాచార కమిషనర్లు ముచ్చటించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, జర్నలిస్ట్ యూనియన్ నేతలు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వల్లాల వెంకటరమణ, గడ్డం కేశవమూర్తి, పి.వేణుమాధవ్, విద్యాసాగర్, బుచ్చిరెడ్డి, అరుణ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేస్తున్న మేయర్

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: కార్మికుల వేతనాలు పెంచుతామని చెప్పి కౌన్సిల్‌లో ఆమోదించి హార్టికల్చర్, మలేరియా, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ అమలు చేయకుండా కేవలం 90 మంది మలేరియా విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రమే ఆమోదించి, మిగతా వారికి పెంచకుండా మేయర్ గుండు సుధారాణి అడ్డుకుంటున్నారని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య ఆరోపించారు. ఈ మేరకు జీడబ్ల్యూఎంసీ కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపి, అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ కలెక్టర్ ఆర్డర్ మేరకు తక్షణమే కార్మికులందరికీ వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియర్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆలకుంట యాకయ్య, సిలివేరు శ్యామ్, దాసరి సమ్మయ్య, యేసు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో కొండపాక రఘు, బొల్లవేణి రాజు, రంజిత్ యాటకాల, గీకురు అశోక్, తిరుపతి, బుర్ర రంజిత్, సాంబన్న, శ్రీధర్, చిరంజీవి, మహేందర్ రెడ్డి, రవీంద్రచారి, రాజు, సాయిరాం, ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

అబ్దుల్ నబీషా దర్గాలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో అంజుమన్ హైదర్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: అంజుమన్ హైదర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని హజ్రత్ అబ్దుల్ నబీషా రహే దర్గాలో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో ముస్లింలు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లే అని అన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అంజుమన్ హైదర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హజ్రత్ ఉమర్ అలీ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్, సయ్యద్ నయీమొద్దీన్ సిరాజ్, మజార్ ఫరూఖీ, ఎండీ.ఖలీద్, హమీదుద్దీన్ హుస్సేన్ పాల్గొన్నారు.

గ్రీన్ చానల్ ద్వారా జీతాలు చెల్లించాలి

హన్మకొండ అర్బన్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెలా 5వ తేదీలోపు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కార్మికులతో కలిసి హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్‌కు అందజేశారు. ధర్నా కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె రామన్న, నాయకులు మంద మల్లేశం, బండ సాంబయ్య, మాట్ల భాస్కర్, ఓనపాకల రాజయ్య, రంజిత్, కొమురయ్య, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, పోచయ్య, ఐలమ్మ, సుగుణ, రాధ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.